క్లుప్తంగా

నాడు-నేడు పనుల పరిశీలన


రిక్డాలు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు

దత్తిరాజేరు: మండలంలోని ఆర్.రామచంద్రాపురం ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పథకంలో భాగంగా రూ.40 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులను బొబ్బిలి డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు సోమవారం పరిశీలించారు. పనుల్లో అవకతవ కలు జరిగినట్లు అందిన ఫిర్యాదు మేరకు పనులను, రికార్డులను పరిశీలించామని ఆయన చెప్పారు. ఎలాంటి అవకతవ కలు జరగలేదని, అంతా సక్రమంగా ఉన్నట్లు తెలిపారు. గ్రామపెద్దలు, గతంలో పనిచేసిన హెచ్ఎం, ఇంజినీరింగ్ అసి స్టెంట్, ఉపాధ్యాయులు ఆయన వెంట ఉన్నారు.

పెట్రోల్ బంకులో తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కొత్తవలస: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని పెట్రోల్ బంకులో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బి.సింహాచలం ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు నిర్వహించారు. చమురు నిల్వల రికార్డులను, చమురు నాణ్యత, తూనికల యంత్రాల సీళ్లను పరిశీలించారు. బంక్‌లో పనిచేస్తున్న లేబర్ బుక్ నిర్వహణ సరిగాలేదని, మరుగు దొడ్లకు రన్నింగ్ వాటర్, వాహనాలకు ఉచితంగా గాలి కొట్టే సదుపాయం లేదని గుర్తించినట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట సహాయ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు, తూనికలు,కొలతల శాఖ అధికారి పి.వి.రంగారెడ్డి, హెచ్‌పీసీఎల్ మేనేజర్ మూర్తి, సీఎస్‌డీటీ టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా స్వర్ణకుమార్


స్వర్ణకుమార్

గంట్యాడ: మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా స్వర్ణకుమార్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈయన డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ప్రసన్నరాఘవ స్వచ్ఛంద పదవీవిరమణ చేయడంతో ఆయన స్థానంలో స్వర్ణకుమార్‌ను నియమించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కొత్తవలస: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు ఆదిశేష వైటల్‌బాబు దారుణ హత్యకు నిరసనగా విధులను బహిష్కరించినట్లు బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.వి.వి. గిరిబాబు తెలిపారు. హత్యకు పాల్పడిన వ్యక్తులపై కఠినచర్యలు తీసుకోవాలని ఆందోళన చేశారు. న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు. న్యాయవాదులు జి.మహేంద్ర, గండి శ్రీరామ్మూర్తి, ఈ.సత్యనారాయణ, కొట్యాడ అచ్చిబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ


గుడివాడలో విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు

వేపాడ: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ -2 బాల భాస్కరరావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని గుడివాడ, ఆకులసీతంపేట ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం ఆయన తనిఖీలు చేశారు. మధ్యాహ్న భోజనాలను, విద్యార్థుల వర్క్‌బుక్స్, హాజరు, సమ్మెటీవ్ -1 మూ ల్యాంకనం తదితర రికార్డులను, పాఠశాలల్లో సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు.

పాఠశాలల్లో తనిఖీలు


పురిటిపెంట ఎస్సీ కాలనీ పాఠశాలలో తనిఖీలు చేస్తున్న ఎంఈఓలు

గజపతినగరం: స్థానిక , పురిటిపెంట ఎస్సీ కాలనీల, ఎం.వెంకటాపురంలోని పాఠశాలల్లో ఎంఈఓలు విమలమ్మ, సాయిచక్రధర్ సోమవారం తనిఖీలు చేశారు. ముందుగా పాఠశాలల్లో భవనాలను, ఇతర సదుపాయాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు.

పథకాలు, సేవల్లో దేశానికే ఆదర్శం


జామి: తాండ్రంగిలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- 'గడప గడపకు మనప్రభుత్వం'లో గజపతినగరం, ఎస్.కోట ఎమ్మెల్యేలు అప్పలనరసయ్య, కడుబండి

జామి: సంక్షేమ పథకాల అమలుతో పాటు ప్రభుత్వ సేవల్లో మన రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నా రు. మండలంలోని తాండ్రంగి గ్రామంలో సోమవా రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు గడపగడపకూ వస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలకు, ఆ పార్టీ నాయకులకు లంచాలు ఇవ్వాల్సి ఉండేదని, అరకొరగా అమలు చేసిన పథకాలు సైతం టీడీపీ సానుభూతిపరులకే అందేవని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామ సచివాల య, వలంటీర్ వ్యవస్థ ద్వారా రూపాయి అవినీతి లేకుండా పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోని సచివాల యాల్లోనే అందుతున్నాయని చెప్పారు. రైతు భరోసాకేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులను ఊళ్లలోనే లభిస్తున్నాయని, గతంలో విత్తనాల కోసం మండల కేంద్రా ల్లోని వ్యవసాయ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ప్రతి సచివాలయం పరిధిలో ఒక వైఎస్సార్ హెల్త్ విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేసి వైద్య సేవలు ప్రజలకు చేరువ చేశామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం ఇస్తూ పరిపాలనలో నూతన ఒరవడికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ గొర్లె సరయు, ఎంపీడీఓ ఎం.సతీష్, తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేముల ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, రాష్ట్ర గ్రేడింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ చలుమూరి సత్యారావు, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, స్థానిక సర్పంచ్ కరక వందన, ఎంపీటీసీ కృష్ణవేణి, నాయకులు కరక దశరథ, కిలారి సూర్యారావు, గేదెల రమణబాబు, ఎన్నింటి శేషు, సూరిదేముడు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయం


వేపాడ: జాకేరులో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

వేపాడ: పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. జాకేరు గ్రామంలో సోమవారం సాయంత్రం స్థానిక సర్పంచ్ బుద్దా చిన్నమ్మలు నేతృ త్వంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో పథకాల ద్వారా కలిగిన లబ్ధిని ప్రతీ కుటుంబానికి వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజలకు పాలన చేరువచేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నాడు-నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. పేదరికం వల్ల ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో జగనన్న అమ్మఒడి, విద్యా కానుక, వసతీ దీవెన, ఫీజు రీయింబ ర్స్‌మెంట్ తదితర పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు ఎమ్మెల్యేను సర్పంచ్, స్థానిక నాయకుడు అప్పలనాయుడు, వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది సన్మానించారు.జెడ్పీటీసీ ఎస్. అప్పారావు, ఏఎంసీ చైర్‌పర్సన్ మూకల కస్తూరి, నెడ్‌క్యాప్‌డైరెక్టర్ పద్మావతి, పంచాయతీరాజ్ ఉత్తరాంధ్ర కన్వీనర్ మెరపల సత్యనారా యణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు, మండల జేసీఎస్ కన్వీనర్ బోజంకి శ్రీను, వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను, సర్పంచ్‌లు గంగరాజు, సతీష్, రామునాయుడు, ఎంపీడీఓ పట్నాయక్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు టీడీపీకి దమ్ముందా..?


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- నియోజకవర్గంలో మంత్రి బొత్స హయాంలోనే అభివృద్ధి
- ఏ గ్రామంలోనైనా బహిరంగచర్చకు తాము సిద్ధమే
- టీడీపీ నేతలకు వైఎస్సార్‌సీపీ నాయకులు సవాల్
- మంత్రి బొత్సను విమర్శించే అర్హత, స్థాయి టీడీపీ నేత నాగార్జునకు లేదు

చీపురుపల్లి: అభివృద్ధి కోసం మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిమిడి నాగార్జున చీపురుపల్లి నియోజకవర్గంలో మంత్రి బొత్స సత్యనారాయణ హయాంలో, టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిపై దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు సవాల్ విసిరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆపార్టీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ గ్రామంలోనైనా అభివృద్ధిపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసిన మంత్రి బొత్సను విమర్శించే స్థాయి టీడీపీ నాయకుడు నాగార్జునకు లేదన్నారు. 14 ఏళ్లు సీఎంగా, కుప్పం నియోజ కవర్గానికి 35 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న చంద్రబాబునాయుడు తన నియోజకవర్గ ప్రజలకు తాగునీరు కూడా అందించలేకపోయిన విషయాన్ని ఆ పార్టీ నాయకులు గుర్తుంచుకోవా లన్నారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి హయాంలో చీపురుపల్లి నియోజకవర్గానికి రూ.83 కోట్లతో ఇందిరమ్మ సుజలధార తాగు నీటి పథకాన్ని తీసుకొచ్చి 2008లోనే ఇంటింటికీ తాగునీరు అందించిన ఘనత మంత్రి బొత్సకే దక్కుతుందన్నారు. చీపురుపల్లిలో ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) ఆధునికీకరణ, అభివృద్ధికి మంత్రి బొత్స 2014 మార్చిలో రూ.4.5 కోట్లు నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. వెనుకబడిన ఈ ప్రాంతానికి ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నికల్ కళాశాలలను తీసుకురావ డంతో పాటు డిగ్రీ కాలేజ్‌ను మోడల్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయించి రూ.13 కోట్ల రూసా నిధులు మంజూరు చేయించింది కూడా ఆయనేనని అన్నారు. ప్రభుత్వాస్పత్రిని 50 పడకలకు అభివృద్ధి, 12 మంది వైద్యులు, 55 మంది సిబ్బంది నియామకం, మెరకముడిదాంలో జూనియర్ కళాశాలకు సిబ్బంది నియామకం....ఇవన్నీ మంత్రి బొత్స వల్లే జరిగాయన్నారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువను తీసుకొచ్చిందికూడా ఆయనేనని అన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు.అభివృద్ధిపై నాగార్జున చర్చకు రావాలని, లేదంటే మరోసారి మాట్లాడకుండా రాజకీయ సన్యాసం తీసుకోవాలని హితవు పలికారు. పార్టీ నాయకులు పతివాడ రాజారావు, సువ్వాడ అప్పలనాయుడు, పనస అప్పారావు, గొర్లె శ్రీరాములు, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: అంకితభావంతో పనిచేసే ఏ ఉద్యోగికి అయినా తగిన గుర్తింపు లభిస్తుందని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. మండల తహసీల్దార్‌గా పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన డి.ప్రసన్న రాఘవను మండలంలోని తామరపల్లిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సోమవారం సన్మానించారు. అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ తహసీల్దార్ ప్రసన్నరాఘవ, నీతి, నిబద్ధతతో పని చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనా యుడు, డిప్యూటీ తహసీల్దార్ స్వర్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స.హ.చట్టానికి 18 ఏళ్లు


ఎంపీడీఓ శేషుబాబుకు స.హ.చట్టం దరఖాస్తులు అందజేస్తున్న ఐక్యవేదిక సభ్యులు

శృంగవరపుకోట: సమాచార హక్కు చట్టం (స.హ.చట్టం) అమలులోకి వచ్చి 18 ఏళ్లు పూర్తయ్యాయని స.హ.చట్టం జిల్లా సమన్వయ కమిటీ సభ్యుడు డి.సూర్యారావు తెలిపారు. జిల్లాలో స.హ.చట్టం అమలుతీరును సమీక్షిస్తూ స్థానిక మండల పరిషత్, ఐసీడీఎస్, వెలుగు, ఉపాధి హామీ కార్యాలయాలను స.హ.చట్టం ఐక్యవేదిక సభ్యులు ఎల్.సాంబమూర్తి, సీహెచ్.రామకృష్ణ, ఆర్.దుర్గాప్రసాద్‌తో కలిసి సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ స.హ.చట్టం వివరాలకు సంబంధించి బోర్డులు ఏర్పాటు చేయాలని, సహాయ పౌరసమాచార అధికారిని నియమించాలని, దరఖాస్తుదారులకు రశీదులు ఇవ్వాలని, స.హ.చట్టానికి సంబంధించి ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎంత మందికి సమాచారం ఇచ్చారన్న వివరాలు తెలుసుకున్నారు. స.హ.చట్టం పక్కాగా అమలు చేసేందుకు సహకరించాలని అధికారులను కోరారు.

అంగన్‌వాడీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీఓ అప్పారావు

చీపురుపల్లి: గరివిడి, చీపురుపల్లి, రాజాం ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న కార్యకర్త, ఆయా పోస్టుల భర్తీకి చీపురుపల్లి ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ ఎం.అప్పారావు నేతృత్వంలో అధికారుల బృందం సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించింది. చీపురుపల్లి ప్రాజెక్టు పరిధిలోని పెదనడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త పోస్టు, గరివిడి ప్రాజెక్టు పరిధిలోని గొర్లె పేటలో కార్యకర్త, కాపుశంభాం-1, పెదబంటుపల్లి-1లో కేంద్రాల్లో హెల్పర్, రాజాం ప్రాజెక్టు పరిధిలో కోనంగిపాడుకేంద్రంలో హెల్పర్ పోస్టు కోసం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తులు చేసుకున్న వారికి ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ విజయకుమారి, కె.వి.ఎన్.రాజరాజేశ్వరి, ఎన్.ఆరుద్ర, కర్లాం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాకర్ట సువర్ణ, సూపర్‌వైజర్లు జె.పైడిమంగమ్మ, జె.లక్ష్మి, ఎం.నాగమణి తదితరులు ఇంటర్వ్యూలు చేశారు.

అన్నదానం


ఆలయంలో భోజనాలు చేస్తున్న భక్తులు

శృంగవరపుకోట: స్థానిక సన్యాసేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. ఆలయంలో ప్రతీ సోమవారం భక్తులకు కొంత కాలంగా దాతల సహకారంతో 70 నుంచి 80 మంది భక్తులకు అన్నదానం చేస్తున్నారు.

ప్రకటన

చీపురుపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పెండింగ్‌లో ఉన్న గుర్ల పోలీస్‌స్టేషన్ CC No. 89/2018, Cr No. 99/2016 U/s 326, 324 IPC పై కేసులో ముద్దాయి అయిన సారిక సీతంనాయుడు S/o అక్కులు, వయస్సు 40 సం॥లు, పున్నపురెడ్డిపేట గ్రామం. గుర్ల మండలం. విజయనగరం జిల్లా. చీపురుపల్లి కోర్టు వాయిదాలకు హాజరు కానందున కోర్టు వారు NBW ఇచ్చియున్నారు. అయినప్పటికీ సారిక సీతంనాయుడు హాజరు కానందున పరారీలో ఉన్నందున సదరు సారిక సీతంనాయుడు Dt. 17.9.2023 (Not less than 30 days) కేసు వాయిదాకు చీపురుపల్లి కోర్టులో ఉదయం 10.30 గంటలకు హాజరు కావలసిందిగా పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలియజేయడమైనది.

ఇట్లు

సబ్-ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, గుర్ల పోలీస్ స్టేషన్

ఓటర్ల జాబితా సర్వే వేగవంతం చేయండి


మెరకముడిదాం: వీఆర్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయభాస్కర్


శృంగవరపుకోట: కొత్తూరులో సర్వేను పరిశీలిస్తున్న తహశీల్దార్ శ్రీనివాసరావు

మెరకముడిదాం: ఓటర్ల జాబితా ఇంటింట సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ విజయభాస్కర్ వీఆర్‌ఓలను ఆదేశించారు. మండల వీఆర్‌ఓ లతో సోమవారం తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సర్వేను బీఎల్‌ఓలు సక్రమంగా నిర్వహించే విధంగా చూడాలన్నారు. ఈవిషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని చెప్పారు. అలాగే గ్రామాల్లో ఎలాంటి రెవెన్యూ సమస్యలు ఉన్నా సచివాలయాల్లో అర్జీలు చేసుకోవాలని ప్రజలకు తెలియజేయాలని సూచించారు.అనంతరం మండల రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. రికార్డులో సక్రమంగా నిర్వహించాలని, ఎండీయూ వాహనాల ద్వారా సకాలంలో రేషన్ సరుకులు పంపిణీ చేసేలా చూడాలన్నా రు. హెచ్‌డీటీ గిరిధర్, సీనియర్ అసిస్టెంట్ నాగమణి పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

శృంగవరపుకోట: పట్టణంలోని పోలింగ్ కేంద్రం -32, మండంలోని కొత్తూరు పోలింగ్ కేంద్రం -57 పరిధిలో ఓటర్ల జాబితాపై బీఎల్‌ఓలు సోమవారం చేపట్టిన ఇంటింట సర్వేను తహసీల్దార్ డి.శ్రీనివాసరావు పరిశీలించారు. పలు ఇళ్లకు వెళ్లి ఓటర్ల వివరాలను జాబితాతో సరిపోల్చి చూశారు. సర్వేలో పాల్గొన్న బీఎల్‌ఓలు, ఎన్యూమరేటర్లతో మాట్లాడుతూ చనిపోయిన వారి పేర్లతో పాటు వలసలు వెళ్లిపోయిన వారిని జాబితాల నుంచి తొలగించాలని సూచించారు. అలాగే 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, ఒక కుటుంబానికి చెందిన వ్యక్తులు అంతా ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఉండేలా చూడాలని చెప్పారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


మాట్లాడుతున్న న్యాయవాది

బొండపల్లి: ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలపై అవగాహన అవసరమని గజపతిగనరం ఫస్ట్‌క్లాస్ మున్సిఫ్ కోర్టు న్యాయవాదులు అన్నారు. బోడసింగిపేట ప్రాథమిక పాఠశాలలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, పలు చట్టాలపై అవగాహన కల్పించారు. రోడ్డు దాటేటప్పుడు ఎదురుగా వచ్చే వాహనాలను గమనించాలని, పాటు నిబంధనలు పాటించాలని సూచించారు. బాలల హక్కులు, చట్టాలను వివరించారు. న్యాయవాదులు పొట్నూరు శ్రీనివాసరావు, శీర వాసుదేవరావు, కొల్లా సాయి, పి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటివద్దకే ప్రభుత్వ సేవలు


మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న జైహింద్‌కుమార్

గంట్యాడ: ప్రభుత్వ యంత్రాంగం ఇంటివద్దకే వచ్చి వారికి అవసరమైన సేవలు అందిస్తున్నారని, ప్రజల వద్దకు పాలన అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ అన్నారు. మండలంలోని వసంత గ్రామంలో సోమవారం నిర్వహించిన 'జగనన్న సురక్ష' క్యాంపులో ప్రజలకు 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ధ్రువపత్రం కావాలన్నా మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారులే ఇళ్లకు వచ్చి ధ్రువపత్రాలు అందిస్తున్నారన్నారు. ఎంపీడీఓ భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి


సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉంటూ, ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యద ర్శులు, వైద్యారోగ్యశాఖ సిబ్బందికి ఎంపీపీ చల్లాచలంనాయుడు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్యారోగ్యశాఖ సిబ్బందితో సోమవారం సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరి నేషన్ చేయాలని, ప్రజలకు రక్షిత తాగునీటిని సరఫరా చేయాలని చెప్పారు. నివాస పరిసరాల్లో మురుగునీరు లేకుండా, వీధిలైట్ల నిర్వహణ పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, ఈఓపీఆర్డీ సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర


అరకు-విశాఖ రోడ్డులో సైకిల్ యాత్ర చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కొత్తవలస: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భారత విద్యార్థి సంఘం (ఎస్ఎఫ్ఐ) జిల్లా వ్యాప్త సైకిల్ యాత్రను చేపట్టింది. కొత్తవలసలో ఈ యాత్రను ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై జిల్లాలో ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర చేయ డం రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి నాందన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పారు.జిల్లాలో 400ల కిలోమీటర్లు సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వెంకటేష్, కేంద్ర కమిటీ సభ్యురాలు పావని, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, సీఐటియూ నాయకులు తరిణీ వెంకటరమణ పాల్గొన్నారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

గంట్యాడ: పశువులు లంపి చర్మ వ్యాధి బారినపడకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నామని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు రెడ్డి కృష్ణ సోమవారం తెలిపారు. టీకాల కార్యక్రమం మంగళవారం ప్రారంభించి, ఈనెలాఖరు వరకు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈవ్యాధి సోకిన పశువులకు 105 డిగ్రీల జ్వరం ఉంటుందని, చర్మంపై పుండ్లు ఏర్పడి, పురుగులు పట్టి చనిపోయే అవకాశం ఉందన్నారు. వ్యాధి బారినపడిన పశువు నుంచి ఇతర పశువులకు ఈవ్యాధి త్వరగా వ్యాప్తి చెందుతుందన్నారు. 4 నెలల దూడల నుంచి పశువులన్నింటికీ టీకాలు వేస్తామని చెప్పారు. పశువులకు అత్యవసర వైద్య సహాయం అవసరమైతే ట్రోల్ ఫ్రీ నంబర్ 1962 కు ఫోన్ చేస్తే సిబ్బంది గ్రామాలకు వచ్చి వైద్యం చేస్తారని తెలిపారు.

9,635 పశువులకు టీకాలు

గజపతినగరం: మండలంలోని 9,635 పశువులకు లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేయనున్నామని తుమికా పల్లి, మరుపల్లి పశువైద్యాధికారులు శశిభూషణ్‌రావు, వెంకటరమణ తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. మంగళవారం నుంచి నెలాఖరువరకు టీకాలు వేయనున్నామని, పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 1న గజపతినగరం, 4వ తేదీన ఎస్.జి.ఆర్.పురం, 7వ తేదీన ఎం.వెంకటాపురం,10న దావాలపేట, 16న బూడిపేట, 22న పురిటిపెంట గ్రామాల్లో టీకాలు వేస్తామని, మిగతా గ్రామాల్లో కూడా షెడ్యూల్ వారీగా టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు.

'స్పందన 'అర్జీలకు సత్వర పరిష్కారం

మెరకముడిదాం: ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందనలో ప్రజల నుంచి అందే అర్జీలకు సత్వరం పరిష్కారం చూపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీఓ ఎం.రత్నం మండల అధికారులకు సూచించారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికే స్పందన

గజపతినగరం: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రతీ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.కిశోర్ కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వ్యవసాయశాఖ అధికారి ధనలక్ష్మి, పంచాయతీరాజ్ డీఈ అప్పలనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నానిబాబు, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

రెండు అర్జీలు

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో రెండు అర్జీలు అందాయని ఎంపిడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్పందనలో అందే అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే గ్రామసచివాలయాల్లో అర్జీలు అందించవచ్చని చెప్పారు.